## కథ

# ఖైదీ

**రాత్రి 10 గంటలకి బయలు దేరింది బస్సు. పండగ రోజులేమో జనంతో కిక్కిరిసిపోయి నిండుగర్భిణిలా ఉంది. పండగని కొత్తగా ఎన్ని బస్సులేసినా అన్నీ ఫుల్ అయిపోయాయి జనంతో.**

సంక్రాంతికి అత్తారింటికి వెళ్లే కొత్తగా పెళ్లయిన అల్లుళ్లు, అత్తవారింటి కబుర్లు అమ్మానాన్నలతో పంచుకోవాలని ఉవ్విళ్లూరే కూతుళ్లు, హాస్టళ్లలో ఉంటూ ఇంటికి తిండికి మొహం వాచిపోయిన కాలేజీ విద్యార్థులు..నగర కాలుష్య జీవనంతో విసుగెత్తిపోయి, నాలుగు రోజులు ఆటవిడుపుగా ఉంటుందని చుట్టాలిళ్లకు ప్రయాణాలు కట్టినవాళ్లు...సుదూర ప్రాంతాల నుండి నగరానికి వచ్చి తమ ఊళ్లకు కానుకలు మోసుకెళ్తున్న వాళ్లు మరికొందరు...

బస్సు ఓ గంట వరకు నత్తనడక నడిచినా, మధ్యలో దాబా దగ్గర వేడివేడిగా టీ పడ్డాక డ్రైవరుకి హుషారొచ్చింది. వేగం పుంజుకుంది బస్సు. అంతదాకా గలగలమన్న ప్రయాణీకులు సద్దుమణిగి తమ రక్షణ బాధ్యత తను డ్రైవర్ మీద పెట్టేసి నిశ్చింతగా నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నారు.

బస్సు ప్రయాణం అలవాటు లేని వారికి మాత్రం చాలాసేపు అసహనంగా సీట్లలో అటూఇటూ కదిలి, ఇంక రాత్రంతా అలా కూర్చునే కునుక తప్పదని గుండె రాయి చేసుకుని, కునికిపాట్లు పడుతూ, మధ్యలో ఉలిక్కిపడి లేస్తూ, పైన పెట్టిన తమ సామాన్లకేసి నిద్ర కళ్లతోనే ఓ చూపు పారేస్తూ మళ్లీ నిద్రలోకి జారుకుంటున్నారు.

ఈ మానవుల కష్టసుఖాలతో నిమిత్తం లేనట్టు, నిశాచర జీవితం అలవాటయిపోయిన డ్రైవర్ నిశ్చలమైన మనసుతో తదేక దీక్షతో బస్సు నడుపుతున్నాడు.

అస్తవ్యస్తంగా పడుకున్న ఆ మనుషుల్ని చూస్తుంటే నిద్రపోయిన వాళ్లకి చచ్చినవాళ్లకి తేడా లేదనిపించింది నాకు. ఎందుకంటే ఇద్దరి ఆత్మలూ ఆ క్షణంలో భౌతిక శరీరానికి దూరంగానే తిరుగుతుంటాయి.

నా పల్లెటూరి రూపానికి అప్పటిదాకా చీదరించుకుంటున్నట్టు మొహం పెట్టి, కుదుపులకి నా శరీరం తగిలినప్పుడల్లా ఆరుద్రపురుగులా ముడుచుకుపోయిన నా పక్కన కూర్చున్న ఆ సూటుబాబు నిద్రలోకి జారుకుపోయాక పూర్తిగా నా మీదకి వాలిపోయి పడుకున్న తీరు చూస్తే నవ్వొచ్చింది.

ప్రతి మనిషి తనకు తానొక ద్వీపం కాదు సముద్రం. అందులో ఎన్ని అగ్నిప్రమాదాలు బడ్డకంగా ముడుచుకుంటున్నాయో, ముత్యాలు, రత్నాలతో బాటు ఎంత బడబాగ్ని నిద్రావస్థలో ఉందోననిపిస్తుంది.

''ఏం గురువుగారూ నిద్ర రాలేదేమిటి?''

బస్టాండ్‌కి వచ్చింది మొదలు బస్సెక్కే వరకు వసపోయిన పిట్టలా నాతో కబుర్లు చెప్పిన యువకుడు చంద్రబోస్ స్వరం. వెనుక సీటులోకి చూస్తే నా సమాధానం ఆశించకుండానే నిద్రలోకి జారుకున్నాడు. మళ్లీ నవ్వొచ్చింది.

బోస్ విదేశంలో సైంటిస్టుగా పనిచేస్తున్నాడుట. అతని కథలాగే మనసూ విచిత్రమైనదే. 'జననీ జన్మభూమిశ్చ' అంటూ తను పుట్టి పెరిగిన ఊరును చూసి ఆనందించాలని సెలవులకి వచ్చాడుట. అతని రక్తసంబంధీకులెవరూ ఆ ఊళ్లో లేరుట. అతని పదేళ్ల వయసులో జరిగిన అగ్నిప్రమాదంలో తండ్రి, తమ్ముడు అక్కడికక్కడే చచ్చిపోతే తల్లి సగం కాలిపోయిందట. తర్వాత వికృతమైన ఆ రూపంతో ఆర్నెలలు బ్రతికినా మనోవ్యధతో ఆత్మహత్య చేసుకుందిట. అప్పట్లో సెలవులకి మేనమామలింటికెళ్లిన తను మాత్రం బ్రతికిపోయాడట. తర్వాత మేనమావలే చదువు చెప్పించారుట. ప్రస్తుతం విదేశాల్లోనే సెటిలయినా చిన్నప్పుడు తను తిరిగిన ఆ ఊరు, పొలాలు, చెట్టు చేమ, తమ ఇంటి పూలతోట, తన నేస్తాలు, బొంగరాలాట, కోతికొమ్మచ్చి ఆటలు, ఆ పరిసరాలు, తన కుక్కపిల్ల వీటిని మాత్రం ఇన్నేళ్లయినా మర్చిపోలేకపోయాడట. తనకి డబ్బుకి లోటు లేకపోయినా, తను పుట్టిన గడ్డను చూడాలనే మమకారంతో అంత దూరం నుండి భార్యాబిడ్డతో వచ్చాడుట.

వాళ్ల పాప ఎంతో ముద్దుగా ఉంది. ''అంకుల్ తినండి'' అంటూ నాకో యాపిల్ ఇచ్చి బలవంతాన తినిపించింది.

వదిన గుర్తొచ్చింది ఆ మమకారానికి. చాలా కాలం వరకు వదినకి పిల్లలు కలగలేదు. తర్వాత అపర్ణ పుట్టింది. బోస్ వాళ్ల పాప రోజీ కూడా అపర్ణలాగే ఉంది.

పాడారిపోయిన కళ్లకి నిద్ర రాక నాకు ఎంతకీ ఆలోచన తెగడం లేదు.

ఒకానొక బలహీన క్షణంలో తీసుకున్న నిర్ణయం నా జీవితాన్నే మార్చేసింది.

తల్లితండ్రీ లేకపోయినా ఇద్దరి వంతు ప్రేమనూ తనే పంచిన అన్నయ్యగానీ, ముద్దుల మరిదినయిన నన్ను కన్నబిడ్డలా సాకిన వదినగానీ, అన్నయ్య పాప అపర్ణ... అమాయకపు మాటలు గానీ నన్ను బంధించలేకపోయాయి.

పట్టభద్రుడయి నిరుద్యోగిలా మిగిలిపోయిన నా చేతగానితనం, కాదు...కాదు... అవినీతిపరుల లంచగొండితనం, స్వార్థం, ఇంట్లో తాండవించే నిత్య దరిద్రం. తప్పులు చేస్తూ కూడా పెద్దమనుషుల్లా చెలామణీ అవుతున్న రాక్షసుల్లాంటి మనుషులు...దగా, మోసం నిండిన ఈ ప్రపంచం, నిర్వీర్యం అయిపోతున్న నా యువశక్తి- నన్ను లోకానికి ఎదురుతిరగమన్నాయి. అడుగడుగూ అడ్డు తగులుతూ ఉన్న పెద్దమనుషుల్ని దోచిపారేస్తుంటే ప్రజాశక్తి నాకు తోడ్పడవలసింది పోయి 'ప్రజాద్రోహి' అంది. అందుకే తనకీ లోకంపై కసి. మోసపోతున్నామని తెలిసే, కావాలని అమాయకత్వంలో ఊబిలో కూరుకుపోతున్న మనుషుల పట్ల క్రోధం!

ఆనాడు తన కసికి క్రోధానికి మరింత ఆజ్యం పోసి చక్కని పరిష్కారం చూపిన 'బాస్' అంటే తనకి గౌరవం. ప్రజల్ని దయాదాక్షిణ్యాలు లేకుండా దోచుకోవడమొక్కటే వాళ్లకి జరగాల్సిన శాస్తి!

తను వాళ్ల దృష్టిలో పబ్లిగ్గా దోచుకునే దొంగ... కానీ, అనునిత్యం ఎన్నో రకాలుగా దోచుకుంటున్న పెద్ద మనుషుల్ని ఏమీ చెయ్యని జనంపై అసమర్థ ప్రభుత్వంపై తనకెందుకు సానుభూతి, గౌరవం ఉండాలి?

ఇదే తన జీవనోపాధి. బయట బ్రతికినన్నాళ్లూ చట్టానికి దొరకనన్నాళ్లూ రాజాలా బ్రతుకుతాడు. దొరికితే శిక్ష అనుభవించి, మళ్లీ బయటికి వచ్చాక ఇదే మార్గం!

''...ప్రకారం ముద్దాయికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడమైనది'' అనే జడ్జి గొంతు మంద్రస్థాయిలో వినడం తనకి మామూలయిపోయింది.

రెండేళ్లకోసారి అలాంటి తీర్పు వినడం, జైలు ఊచలు లెక్కపెట్టడం, మళ్లీ విడుదల, మళ్లీ నేరం, తీర్పు, జైలు ఊచలు.

అప్పుడప్పుడూ పోలీసులకి దొంగలు ఎవరూ పట్టుబడనప్పుడు నెలో రెండు నెలలో వాళ్లకి అతిథి అవుతుండడమూ మామూలే.

'మంచిగా బ్రతుకు' అంటూ తన బట్టలు, కొన్ని డబ్బులూ చేతిలో పెట్టి దయగా చూస్తాడు జైలరు

**పి.వి.శేషారత్నం**

ఎప్పటిలాగా.

అతను జైలు అధికారి. తను అతని దయకు పాత్రుడేనా అసలు?

రెండేళ్లపాటు ప్రతీసారీ ఎవరి జోలీ పట్టించుకోకుండా బ్రతికే తనపై అధికారులందరికీ జాలి. ముఖ్యంగా జైలరు యాదగిరి! అతనెవరో, తనెవరో. జైలరు... ఖైదీ...అదీ అనుబంధం కాదు. అంతకు మించినదేదో ఉందంటాడు ఆయన.

ప్రశాంతత ఉట్టిపడే చిరునవ్వు, మెడలో దేవుడి బిళ్ల. శాంతి దూతలా ఉంటాడు. అతను కురిపించే జాలి తనకు రంపపు కోతలా ఉంటుంది. జాలి భరించలేడు తను.

ఈ జనమంతా తన మొహమ్మీద ఉమ్మెయ్యాలి. తన అవతారం చూసి జాలి పడుతున్న జనాన్ని చూస్తూ కడుపులో అగ్ని జ్వాలలు రగులుతాయి.



''భగవంతుడు ఈసారి నా ప్రార్థన ఆలకిస్తాడు సుధీర్! నీలో తప్పక మార్పు వస్తుంది. మనం ఈసారి ఇలా కలుసుకోవడానికి వీల్లేదు. ప్రపంచంలో నిన్ను ఒక ఉన్నతమైన వ్యక్తిగా కలుసుకోవాలి. ఈసారి నువ్వు వచ్చేసరికి నేనుండకూడదు''

''బాబుగారూ!'' తన గొంతులో కలవరం.

''గాభరా పడకయ్యా! ఎందుకంటే నేను రిటైరైపోతున్నానయ్యా! హ్హహ్హహ్హ..'' తన గుండె తేలికపడింది... జైలరు నవ్వుతో.

''నాకు కొడుకులు లేరు సుధీర్! నాకున్న ఒక్కగానొక్క కొడుకు సబిన్స్పెక్టర్‌గా జీవితంలో తొలి మెట్టెక్కిన నా విజయ్, స్వల్ప కాలంలోనే గూండాల, అవినీతిపురుగుల గుండెల్లో నిద్రపోయిన నా బాబు.. వాడిని, దారుణంగా కాల్చి చంపేశారు సుధీర్! ఆ బాధతోనే నా భార్య కన్నుమూసింది. నా కూతురు ఎక్కడో చల్లగా సంసారం చేసుకుంటోందన్న ఒక్క ఆశతోనే బ్రతుకుతున్నాను. రిటైరయ్యాక దాని దగ్గరకే వెళ్తాను'' యాదగిరి కళ్లల్లో నీళ్లు.

''ఏం మాట్లాడవు? నీకేం బాధగా లేదా?'' మళ్లీ ఆయనే అన్నాడు.

''ఆ...ఉంది.'' ఒక్క ఆయన దగ్గరే తనెందుకు తడబాటు. తమవాళ్లు... ఆ కాల్చి చంపింది తమ బాస్ ఆజ్ఞతోనే అనే విషయం తనెలా చెప్పగలడు?

''మరయితే నా మీద ఒట్టేస్తావా? నిండా ముప్పయ్యేళ్లు లేవు నీకు. ఈ ముళ్లబాట ఎందుకు చెప్పు''

తను పీకలదాకా మునిగిపోయాడన్న సత్యం ఆయనకెలా చెప్పగలడు? తెలిసో తెలియకో ఆనాడు ఈ ముఠాతో సంబంధం ఏర్పరుచుకున్నాడు.

''సుధీర్! నువ్వు ఒట్టు వెయ్యవు కదూ! ఇన్నాళ్ల సాన్నిహిత్యంతో నా మీద గౌరవం రవంతైనా ఉంటుందనుకున్నాను''

''సర్! మీ మాట తప్పకుండా పాటిస్తాను'' అసంకల్ప ప్రతీకార చర్యలా తన గొంతు పలకడం తనకే విచిత్రంగా అనిపించింది.

''రిటైరైపోతున్న వాడి మాటకు విలువేంటి అనుకోకు బాబూ! ఈసారి నాతో వచ్చెయ్యి, నాకు చేదోడువాదోడుగా ఉండు. నా చరమజీవితం నీ దగ్గర ప్రశాంతంగా గడిపేస్తాను. ఆడపిల్లలకి మనపై ఎంత అభిమానమున్నా నా కూతురు దగ్గరకెళ్లి ఉండడం గౌరవం కాదేమోననిపిస్తోంది''

తనేం చెప్పలేదు. తను విషవలయంలో ఇరుక్కున్నాడు.

అదొక పులి స్వారీ లాంటిది. పులిని ఎక్కనంతవరకే. ఎక్కినవాళ్లు ఎప్పటికీ తమంతట తాము దిగలేరు. దిగారో ఆ పులే తినేస్తుంది. ఏ రకంగా చూసినా మృత్యువు కనుచూపు మేరలో పలకరిస్తూనే ఉంటుంది. అందుకే ఈ బాట వదిలి మామూలుగా జీవించడం అసంభవం. అలా బ్రతకాలన్నా ఆ సంఘం నిబంధనల ప్రకారం తనకు మరణదండన ఖాయం. తనీ విషయాన్ని ఈ అమాయకుడికి ఎలా చెప్పగలడు?

''నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు సుధీర్? నేను మాట తప్పితే ఈ ముసలాడేం చెయ్యగలడూ అని కదూ! ఈసారి చూద్దువుగాని. లోకంలోని పాపుల కోసం తానే ఆహుతై పవిత్ర రక్తం చిందించాడు జీసస్. ఆయనంతటి వాడిని కాకపోయినా ఈసారి మళ్లీ నువ్వు జైలుకి వస్తే నేనాత్మాహుతి చేసుకుంటాను. నా చావులోనయినా నీకు కనువిప్పు కలిగితే ఈ బొటనవేలు చూడు ఒకసారి ఒకానొక దొంగని మార్చేందుకు నరుక్కున్నాను.''

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

''వద్దు సర్! మనం ఇలా కలుసుకోవడం ఇదే ఆఖరి సారి'' తను నిబ్బరంగా అన్నమాటకి పొంగిపోయాడు యాదగిరి.

''ఈ రోజు నా ఇంట్లో భోజనం చేద్దాం'' బయట ప్రపంచంలో స్వేచ్ఛగా ఉంటూ కూడా ఇంటి నాలుగ్గోడల మధ్య ఒంటరితనంలో బందీ అయినా యాదగిరిని, ఆ ఇల్లును చూసి తన మనసు ఒక్క క్షణం స్పందించింది. ఒకే ఒక్క క్షణం. అంతే.

''నా కూతురు వస్తోంది వచ్చే నెలలో. అప్పుడు దాని పిల్లల కేరింతలతో కళకళ్లాడుతుంది. అందాక ఇదో స్మశానం. అంతే. నువ్వెప్పుడొచ్చినా నా ఇల్లు నీకు స్వాగతం చెప్తుంది సుమా!''

కడుపు నిండా భోజనం పెట్టి తన చెయ్యి మెత్తగా నొక్కి వీడ్కోలు చెప్పాడు ఆయన. ఎందుకీ మమకారం తనపై...

ఆయన మాటకు విలువనివ్వాలని విడుదలయిన తర్వాత, రెండ్రోజులూ రైలెక్కుతూ, దిగుతూ అస్తవ్యస్తమైన మనసుతో దిగాలుగా తిరిగాడు తను. మంచికీ చెడుకీ మధ్య తన మనసు పడే సంఘర్షణ తట్టుకోలేకపోయాడు. అంతే...

అలవాటు చొప్పున చేతులు కట్టుకొని బాస్ ముందు నిల్చున్నాడు. ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు బాస్.

''తప్పకుండా నువ్వొస్తావని తెలుసు సుధీర్! నువ్వు రిలీజ్ అయిన రోజే నీ కోసం మారు వేషాల్లో మన వాళ్లు ఎదురుచూసారే... ఈ రెండ్రోజులూ ఏమయ్యావు?'' అన్నాడు తనెక్కడెక్కడ తిరిగాడో అన్న గూఢచారుల కళ్లతో కనిపెట్టే బాస్.

''సరే నీతో ముఖ్యమైన పని పడింది...మనం రేపు రాత్రి... నిమిషాలకు..'' అంటూ దోచుకోబోయే బస్సు వివరాలు, ఎవరెవరు ఎక్కడ కాపుకాయాలో, డ్రైవరునూ, కండక్టరునూ ప్రయాణీకులను ఎలా బెదిరించాలో వివరాలన్నీ చార్ట్ ద్వారా చూపించాడు. ప్లాన్ ప్రకారం తక్కిన ముఠా సభ్యులంతా మారువేషాల్లో సాధారణ ప్రయాణీకుల్లా ఎలా ఎక్కడెక్కడ బస్సెక్కుతారో చెప్పాడు.

తన మనసులో యాదగిరి...రెండు చేతులతో మొక్కుతున్నట్టు...

తను నసుగుతున్నట్లుగా అన్నాడు. ''నేను ఇలాంటి వాటికి దూరంగా ఉండాలనుకుంటున్నాను బాస్''

అతనేమీ ఉలిక్కిపడలేదు. ఔషధం తాగనని మారాం చేసే పసిపిల్లాడిని చూసినట్టు చూసి తియ్యగా నవ్వాడు బాస్.

''మరేం చేస్తావ్? ఈ ప్రపంచం ఎంతగా కుళ్లిపోయిందో చూశాగా. నువ్వు ఒక్కసారిగా మంచివాడిగా మారిపోతే నమ్ముతుందనుకున్నావా? ఎన్నిసార్లు పోలీసులు నువ్వు చెయ్యని నేరాలకు వాళ్ల స్వార్థం కోసం నిన్ను బందీ చెయ్యలేదూ! పిచ్చివాడా! మనం చేస్తున్నది తప్పు కాదు. మన బ్రతుకుతెరువు కోసం. ఈ సంఘం మీద కసి తీర్చుకోవడం కోసం.''

''అసలు నాకు బ్రతకాలనే అనిపించడం లేదు బాస్!'' ఈసారి తన మాటల్లో కఠోర నిర్ణయం. ఒక్క నిమిషం బాస్ మాట్లాడలేదు.

''నువ్వు చెప్తున్నది నిజమేనా? ఎందుకని?''

''ఎందుకో చెప్పలేను. కానీ ఒక్క కోరిక మిగిలిపోయింది. అమ్మానాన్నా పోతే పాతికేళ్లు నన్ను సొంత కొడుకులా చూసుకున్న మా అన్నావదినల ఋణం డబ్బుతోనైనా తీర్చుకుని..''

''ఆగాగు.. నువ్వు సంపాదించిన వాటా నా దగ్గర భద్రంగా ఉంది. అయినా అదే మూలకు వస్తుంది? నీకభ్యంతరం లేకపోతే.. ఇది టాప్ సీక్రెట్ ఇది చాలా పెద్ద అసైన్‌మెంట్ మనకు. నువ్వా పని చేసి పెడితే నువ్వు కోరుకున్నదానికి వంద రెట్ల డబ్బు నీవాళ్లకి చేరేలా చేసే బాధ్యత నాది.''

''ఎంత డబ్బున్నారు?'' తన ప్రశ్న తనకే చిత్రంగా తోచింది.

తను డబ్బుకు వశమవుతున్నాడని మురిసిపోతున్న బాస్ ''యాభై లక్షల రూపాయలయినాసరే.. ఈ క్షణంలోనే నువ్వెవరి అకౌంట్‌లో ఎలా వెయ్యమంటే అలాగే అక్కడికే..'' అన్నాడు.

బహుశా అతగాడు చెప్పే పని అత్యంత ప్రమాదకరమైనది కావచ్చు. లేదా నా ప్రాణమే పోయేది కావచ్చు అని మాత్రం అర్థమయింది. మరో ఆలోచన లేకుండా ఒప్పుకున్నాడు తను. బహుశా జీవితంలో నేను చేసే మంచి పని ఇదే అయ్యుంటుంది. ప్రమాదంలో అవిటివాడయిన అన్నయ్య, పెళ్లీడుకొచ్చిన కూతురు, చిరుగుల చీరన మహానందంగా కప్పుకునే వదిన... వాళ్ల దరిద్రం తీరిపోవడమే కాదు, మూడు తరాలకు సరిపడేంత డబ్బు అది.

''ఇప్పుడు చెప్పండి ఆ పనేమిటో. ఏమీ సందేహించవద్దు''

అతడు నా భుజం తట్టి చెవిలో రహస్యంగా చెప్పాడు. నా కడుపులో బాంబు పేలినంత ఉత్పాతం. అయినా నా నిర్ణయం సడలలేదు. నా మనసు మహా కఠినమయిపోయింది. యాదగిరి రూపం వెనక్కి వెళ్లిపోయింది.

★ ★ ★

మధ్యలో నాకూ కాస్త నిద్ర పట్టింది. మెలకువ వచ్చినపుడు టైము చూసుకున్నాను. తెల్లారడానికి ఇంకా మూడు గంటలుంది ఇంకా నయం... ఇప్పుడు మెలకువ రాకపోతే ప్లానంతా భగ్నమయ్యేది.

బస్సాగింది. అరె! తనాపకుండా ఎందుకాగింది? నా ప్రశ్నకు సమాధానం దొరక్క ముందే మళ్లీ కదిలింది. సరిగ్గా నాలుగ్గంటలకు ముహూర్తం. వీళ్లందరికీ యముడి పిలుపు...నాతో బాటు వీళ్ల శరీరాలు తునాతునకలయి ఎముకలు గాలిలో ధూళిలా, నేలంతా రక్తపు ముద్దల ఎర్రని ముగ్గులు. కకావికలయ్యే ప్రభుత్వం... వీళ్ల ఆప్తుల రోదనలు.


తొలి ప్రయోగం తనతోనే అన్నాడు బాస్. తను మానవ బాంబు అని ఎవరయినా ఊహించగలిగేరా? ఓ పల్లెటూరి రైతు యువకుడిలాగే తనూ బస్సెక్కాడు. తన బట్టల లోపల అల్లుకున్న వైర్లు...బాం...బు...

''గురువుగారూ!'' తను ఉలిక్కి పడ్డాడు. ''టైమెంతయింది? తెల్లారిపోయిందా?'' ఆవలిస్తూ చంద్రబోస్ మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు.

తనకి నవ్వొచ్చింది. మరో అరగంటలో అది శాశ్వత నిద్ర అవుతుంది. పాపం! ఇక్కడే పుట్టి ఎక్కడో సంపాదించుకుంటూ మళ్లీ ఇక్కడే భూస్థాపితం అయ్యేందుకు మృత్యువు రారమ్మని పిలిస్తే వచ్చాడు పిచ్చి చంద్రబోస్!

చంటిపాప వెక్కిళ్లు పెడుతుంటే నెలలు నిండిన బహుశా తల్లి కాబోలు భారంగా లేచి ఊరుకోబెట్టి జోకొడుతోంది. నిద్ర బరువుతో కళ్లు మూసుకుపోతున్నాయామెకు. రాత్రి భర్త ఇద్దరు పిల్లలతో బస్సెక్కింది. పల్లెలోని అత్తారింటికి వెళ్తోందిట. కాసేపయ్యాక బస్సు కుదుపులకి పైనున్న ఆవిడ సూట్‌కేస్ కిందపడింది. నేను ఉలిక్కిపడ్డాను ఎవరయినా లేస్తారేమోనని. కానీ తల్లి ఒళ్లో ఉన్నట్టున్న బస్సు తూగుడుకి ఎవరికీ మెలకువ రాలేదు.

నాకు ఇంకా పావుగంటే టైముంది. నా వేళ్లు బటన్‌పై సుతారంగా తడిమాయి. తర్వాత ధమాల్...




పని పూర్తయిన మరుక్షణం. అంతే ఈ బస్సు తునాతునకలయిన క్షణాన అన్నా వదినలకు లక్షలాది రూపాయలు అందుతాయి.

నా కాళ్ల దగ్గర పడిన తెరచిన సూట్‌కేసు లోంచి బట్టల మధ్య ఫామిలీ ఫోటో. బస్సులోని నీలి బల్బు వెలుతురులో అస్పష్టంగా ఉంది. అప్రయత్నంగా ఫోటో చేతిలోకి తీసుకుని పెన్‌టార్చి వెలుతురులో చూశాను.

నిజానికి అది నాకు అనవసరమయిన పనే. కానీ...అది చూడగానే మళ్లీ నా పక్కలో బాంబు పడినంత ఉత్పాతం.

రాత్రి మసక వెలుతురులో తను ఆమెను సరిగా గమనించలేదు. ఆ ఫోటోలో యాద

గిరి పక్కన ఆమె, భర్త ఇద్దరు పిల్లలు...అంటే ఆమె? జైలరు యాదగిరి తన ప్రాణాలన్నీ పెట్టుకుని బ్రతుకుతున్న కూతురు...

తన గుండెపై పైకి వినిపించకుండా సెల్ మోగుతున్న ధ్వనికి అనుగుణంగా స్పర్శ. అంటే బాస్ తనకు తన కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాడు.

నా బొటన వేలు బటన్ మీదికి పోవడానికి రెండు నిమిషాలన్నమాట.

''గురువుగారూ! మా ఊరొచ్చేసిందా?'' చంద్రబోస్ మాటలు. ఈసారి నిద్రమత్తు లేదు వాటిలో.

నాలో ఒక్క క్షణం ఏదో తెలియని అలజడి. తలలో ఏదో కదలిక. ఎందుకో తెలియదు.

ఎన్నో ఏళ్లుగా కరడుకట్టిపోయిన నా హృదయం కరిగి నీరై ప్రవహించడం మొదలుపెట్టింది. అందులో ఈ లోకం పట్ల గల కసి ద్వేషం కొట్టుకుపోయాయి.

మొట్టమొదటిసారిగా నాకు ఈ ప్రపంచం మీద కరుణ కలిగింది. మరో క్షణంలో ఏమి జరుగబోతోందో తెలియక అమాయకంగా నిద్రపోతున్న మనుషుల పట్ల జాలి!

ఎవరో చేసిన తప్పులకు వీళ్లని శిక్షించే అధికారం నాకేం ఉంది?

ఏం జరుగుతోందో నాకు అర్థమయ్యేలోపు నేను బస్సాపమని డ్రైవర్‌ను రిక్వెస్ట్ చేశాను.

''ఇంకా స్టాపు రాలేదు. ఊరి పొలిమేరల్లో ఉన్నాం'' వింతగా అన్నాడు డ్రైవర్.

''ఫరవాలేదు మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. ప్లీజ్..''

బస్సాగింది. టైము ఆరవుతున్నా చలికాలం మూలాన వెలుగుపూలు పూర్తిగా విచ్చుకోలేదు. వెలుగుకు స్వాగతమిస్తున్న ఈ ప్రకృతి ఎంత అందంగా ఉంది? ఇన్నాళ్లూ ఈ అందం నాకెందుకు అనుభూతి కాలేదు? బోస్ అంత దూరం నుండి మాతృభూమి కోసం తహతహలాడుతూ వచ్చాడనగానే నాలో కదలిక వచ్చిందా?

ఊహూ! అదే నిజమయితే తను చివర వరకు మానవ బాంబుగా ఆహుతి అవడానికే ఎందుకు బటన్‌పైనే వేలు ఉంచాడు?

బస్సు కనుమరుగుకాగానే నా షర్ట్ విప్పేశాను. ఒంటి నిండా చిత్రవిచిత్రమైన వైర్లు. వాటిని తీరికగా విప్పుకున్నాను. ఆ బాంబు కట్టుకున్న బెల్టును దూరంగా విసిరేయాలని నా ఆలోచన. ఇక్కడ పెద్దగా శబ్దమయినా ఎవరికీ తెలియదు.

''వద్దు...అది నా చేతికివ్వండి. ఇంక అది పేలదు లెండి'' వెనకగా నవ్వుతూ నిల్చున్నాడు చంద్రబోస్. నాలో చైతన్యం ఉడిగింది.

''గురువుగారూ! నా పరిశోధన సక్సెస్ అయింది. మీరు మారిపోయారు. ఇంక మీ వల్ల ఈ ప్రపంచానికి ప్రమాదం లేదు''

''ఏమిటి మీరంటున్నది...ఇంతకీ మీరెవరు? ప్రయోగమేమిటి?'' గొంతులోంచి మాటలు బయటకు రాని విభ్రమం నాలో. నా భావం అర్థమయిన వాడిలా అన్నాడు బోస్-

''చెప్తాను. ప్రస్తుతం సెంట్రల్ హోం డిపార్టుమెంట్‌లో చీఫ్ ఫోరెన్సిక్ సైంటిస్ట్‌ని. ఉగ్రవాద శక్తులు మానవ బాంబులను ఆయుధాలుగా ఉపయోగిస్తూ వినాశనానికి పాల్పడుతున్నాయి. మీ బాస్‌కి ఈ దేశంలో మానవ బాంబుల రూపంలో విస్ఫోటనాలు జరిపి జననష్టంతో ప్రభుత్వాన్ని అల్లకల్లోలం చేయాలని పెద్ద అసైన్‌మెంట్ దొరికి, ఆదేశాలందినట్టు, ఇంటెలిజెన్స్‌కి సమాచారమొచ్చింది. అమెరికాలో మానవ బాంబులను దూరం నుంచి ముందుగానే పసిగట్టే విభాగంలోను, ఎలక్ట్రో మాగ్నటో తరంగాలను పంపించడం ద్వారా చివరి నిమిషంలో మానవ బాంబు, తనను తాను పేల్చుకోకుండా కట్టడి చేయడంలోను శిక్షణ పొందిన నేను, నా మాతృభూమి సేవ కోసమే ఇండియా వచ్చేశాను. కొన్ని పశ్చిమ దేశాలు పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే ఇలాంటి శక్తుల నుండి బయటపడుతున్నాయి. ఈ తరంగాల ప్రయోగంతో తనను తాను పేల్చుకోవాలనే యోచనను మార్చుకుని టార్గెట్ ఏరియా నుండి ఆ మానవ బాంబు బయటపడిపోతాడు. ఆంధ్రాలో మానవబాంబు ప్రయత్నాలకు భంగం కలిగించే అసైన్‌మెంట్ నాకప్పగించబడింది. ఈ రెండుమూడు రోజుల్లో అటువంటి తొలి ప్రయత్నం జరగవచ్చని సమాచారం తెలిసింది. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, జనసమ్మర్దమున్న ప్రాంతాలు తిరుగుతూ చివరికి బస్టాండులో నా దగ్గరున్న ఆపరేటస్ ద్వారా మిమ్మల్ని మానవ బాంబుగా గుర్తించాను. అప్పుడే మిమ్మల్ని అరెస్టు చేయించినా, అసలు వాళ్లు తప్పించుకుపోయే ప్రమాదం మాట ఎలా ఉన్నా భారతదేశంలోని పరిస్థితుల్లో ఇక్కడి మనుషుల మనసును కట్టడి చేయడంలో నా ప్రయోగం సఫలమవుతుందో లేదో చివరి నిమిషం వరకు నాకు సందిగ్ధమే. నాకూ నా కుటుంబానికి ప్రాణాలకు ప్రమాదమని తెలిసీ తెగించాను. ఈ ప్రయోగంలో నేను సఫలీకృతమయితే నా జన్మభూమికి సేవ చేసి ఋణం తీర్చుకున్నవాడినవుతాను. లేదా, సేవ చేస్తూనే మరణించినా తల్లి ఋణం తీర్చుకున్నానన్న తృప్తి మిగులుతుంది. రాత్రంతా మీరు నిద్రపోరని తెలుసు. మీరు ఏ టైము నిర్ణయించుకున్నారో నాకయితే తెలియలేదు. అందుకే మీరు కదిలినప్పుడల్లా మీ ఆలోచన చెదరగొట్టేందుకు 'గురువుగారూ' అంటూనే వచ్చాను.''

''అయితే మీ కుటుంబం అగ్నిప్రమాదం..మీ ఊరు..అవన్నీ..''

''అందులో అక్షరం అబద్ధం లేదు. అయితే మీరు మా ఊరెళ్లే బస్సులోనే ఎక్కుతారని మాత్రం నేను ముందుగా ఊహించలేదు. ఈపాటికి మా మావయ్య ఇంట్లో ఆప్యాయతలను ఆస్వాదిస్తూ ఉండి ఉంటారు మా ఆవిడా, పాపా.''

తర్వాత నా చరిత్ర అంతా ఓపికగా విన్నాడు చంద్రబోస్. ''సుధీర్‌గారూ! మీరు ఎంతగానో పొరబడ్డారు. తనది కాని బిడ్డను కన్నబిడ్డలా పెంచిన త్యాగమూర్తులయిన మీ అన్నా, వదినా, జనం రక్తంతో తడిసిన డబ్బును - అవి కోటి రూపాయలయినా కూడా ఎలా ఆనందంగా స్వీకరిస్తాననుకున్నారో నాకర్థం కావడం లేదు. పైగా మీలాగే అన్యాయం జరిగిన ప్రతివాడూ ఇలాగే తయారయితే ఈ దేశం ఎప్పుడో సర్వనాశనమయిపోయి ఉండేది. మనలాంటి యువత ఎన్ని త్యాగాలయినా ఓర్చి జనంలో చైతన్యం తేవడానికి ప్రయత్నించాలి తప్ప ఇదా మార్గం? మరో విషయం. ఇది నా ప్రయోగానికి ఛాలెంజ్‌గా భావించి నేను మీ గురించి ఎవరికీ ఇన్ఫర్మేషన్ ఇవ్వలేదు. అందుకే మీరు నా బందీ కారు''

నా చేతిని సుతిమెత్తగా నొక్కాడతను. ఆ దేశ భక్తుడి స్పర్శ నాలో కొత్త రక్తాన్ని నింపుతున్నట్టుగా అనిపించి ఆ చెయ్యి వదల్లేదు నేను.

ఈ విశాల భవజలధిలో దగ్గర దగ్గర తిరుగాడుతూనే ఉన్నా ఏ ఇద్దరి మధ్యా దాటలేనంత దూరంగా ఉంటాం. కాని ఇపుడు మా ఇద్దరి మధ్య ఇప్పుడు ఏదో దగ్గరితనం.

అదే..బంధం- రక్త సంబంధమే కానక్కరలేదు.

''మీరేమనుకోకపోతే ఒక్కమాట''

''చెప్పండి సుధీర్‌గారూ! నేను మీ స్నేహితుడిని''

''నేను మీ ప్రయోగం...అంటే ఆ కిరణాలేవో పని చెయ్యడం వల్లనే బస్సు దిగి వచ్చేశానో లేక..''

అతడు విస్మయంగా చూశాడు. ''అంటే''

''ఎందుకంటే ఆఖరి క్షణంలో నేనో ఫామిలీ ఫోటో చూశాను. నేను ఖైదీనే అయినా నన్ను పుత్రవాత్సల్యంతో ఆదరించి నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ వ్యక్తికి పుత్రికాశోకం కలిగించలేక ఆగిపోయి ఉంటే..''

బోస్ తడబడలేదు. ''అయినా ఫరవాలేదు. ఈ ప్రపంచాన్ని శాసించగలిగేది మేధ మాత్రమే కాదు. ప్రేమ, మానవత్వం కూడా. మానవత్వ ప్రయోగ సాఫల్యాన్ని మించినదేముంటుంది? యాదగిరి గారు సక్సెస్ అయ్యారని తృప్తి పడతానే తప్ప నా ప్రయోగాలు ఆపను''

తర్వాత ఊళ్లోకి నడుస్తున్నంత సేపూ అతడు మాట్లాడనే లేదు. బహుశా తన పరిశోధన...ప్రయోగం.. సాఫల్యం... విషయంలో అతని మనసు చెదిరి ఉంటుందా? నా జీవితం క్షణికయితేనేం? ప్రతి జీవితంలోను ఒకటో రెండో మధుర క్షణాలుంటాయి. మిగిలిన జీవితం అంతా వాటికి ఉపోద్ఘాతం. స్మృతి! అంతే! పచ్చని పరిసరాలతో ప్రశాంతంగా ఉన్న ఆ ఊళ్లోకి అడుగు పెడుతున్న నా మనసులో సందేహం మాత్రం తీరలేదు.

నన్ను ఆపింది చంద్రబోస్ ప్రయోగమా లేక యాదగిరి ఫామిలీ ఫోటోయా?